క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



నిజాంసాగర్(జుక్కల్): సింగితం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విఠల్ ఈ నెల 9న అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబానికి రూ. లక్ష చెక్కును పీఆర్టీయూ నాయకులు అందజేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుషాల్ చేతుల మీదుగా చెక్కును అందించారు. నాయకులు భాస్కర్‌గౌడ్, కలకొండ నారాయణ, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఫిజియోథెరపి క్యాంపు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపి క్యాంపును నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ అరుణ్ చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. ప్రతిరోజు చిన్నారులకు ఫిజియోథెరపీకి సంబంధించిన వ్యాయామాలను చేయించడం వల్ల అంగవైకల్యం దూరమవుతుందన్నారు. సిబ్బంది శివకుమార్, వెంకటేశం ఉన్నారు.

రికవరీ చేసిన ఫోన్ల అప్పగింత



బాన్సువాడ: బాన్సువాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ చోట్ల చోరీకి గురైన 11 సెల్‌ఫోన్లను బుధవారం సీఐ మహేందర్‌రెడ్డి బాధితులకు అప్పగించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 11 ఫోన్ల గురించి విచారణ చేపట్టగా హర్యానా, మహారాష్ట్ర, హైదరాబాద్, కోటగిరి, నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం, కొత్తగూడెం తదితర ప్రాంతాల నుంచి ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అప్పగించామని ఆయన తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లను కొనుగోలు చేయవద్దని, ఎక్కడైనా ఫోన్ దొరికితే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. సీఈఐఆర్ ఆపరేటర్ రాజేష్‌ను సీఐ అభినందించారు.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన బాలచంద్రానికి ఎస్సై గణేష్ బుధవారం రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను అందించారు. బాలచంద్రం కొద్ది రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆచూకీ గుర్తించి ఫోన్‌ను అప్పగించారు.

హోం ఓటింగ్ పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో హోం ఓటింగ్‌ను బుధవారం జుక్కల్ అసెంబ్లీ ఎన్నికల అబ్జర్వర్ చిపాంగ్ హరతూర్ పరిశీలించారు. ఉమ్మడి నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లో 46 మంది హోం ఓటర్లు ఉండగా 12 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహమ్మద్‌నగర్‌లో హోం ఓటింగ్ విధానంతో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లతో ఆయన సంబాషించారు. ఆయన వెంట గిర్దావర్ అంజయ్య, ఎన్నికల అధికారులు ఉన్నారు.

జీపీకి ఫ్రీజర్ వితరణ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): పద్మాజీవాడిలో నేతాజీ యూత్ సభ్యులు బుధవారం గ్రామ పంచాయితీకి ఫ్రీజర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతాజీ యూత్ అధ్యక్షుడు యాల్ల సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కాటిపల్లి భాస్కర్, మడిపెద్ది ఆనంద్, ప్రశాంత్ రెడ్డి, అనిల్‌రెడ్డి, రమేశ్, నరేశ్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

27న సామూహిక నవదుర్గ, సత్యనారాయణ వ్రతాలు

కామారెడ్డి అర్బన్: కార్తీక పున్నమి సందర్భంగా ఈనెల 27న స్థానిక తూర్పు హౌసింగ్‌బోర్డు కాలనీలోని శారదా ఆదిశంకర ఆలయంలో ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతం, 11.30 గంటలకు నవదుర్గా సామూహిక వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తెలిపారు. వ్రతాల్లో పాల్గొనే దంపతులు 9397330582, 7036474363 నంబర్లకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే
- బిచ్కుందలో ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధేకు తిలకం పెడుతున్న మహిళ

బిచ్కుంద(జుక్కల్): గత పాలకుల అభివృద్ధి, నేను చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని జుక్కల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే హన్మంత్ సింధే విన్నవించారు. బుధవారం మండల కేంద్రంలో 13, 14, 15 వార్డులలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

మహిళలకు లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, కొత్త మేనిఫెస్టో పేదలకు ఉపయోగపడే విధంగా ఉందన్నారు. ఇరవై సంవత్సరాల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, నాలుగోసారి గెలిపించండి.. మీ సేవకుడిగా ఉంటానని అన్నారు. ప్రజల బాగోగులు పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇప్పుడు మీ ముందుకు కొత్త వేషాలతో వస్తున్నారు.. వారి మోసపూరిత వాగ్దానాల నమ్మి మోసపోవద్దని కోరారు. ఎంపీపీ అశోక్, జెడ్పీటీసీ నాల్చర్ భారతి, సొసైటీ చైర్మన్ బాలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శం

- జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్



మద్నూర్/నిజాంసాగర్(జుక్కల్): సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. మద్నూర్, డోంగ్లీ, జుక్కల్ మండల కేంద్రాల్లో బుధవారం ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే హన్మంత్‌సింధేకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్‌సింధేకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కలిసికట్టుగా పనిచేస్తే ప్రతిపక్షాల డిపాజిట్ గల్లంతవ్వడం ఖాయమన్నారు. తెలంగాణ రాష్ట్ర పథకాలను పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. మద్నూర్ సర్పంచ్ సురేష్, నాయకులు విజయ్, హన్మండ్లు, నర్సింలుగౌడ్, నీలుపటేల్, సాయాగౌడ్, రవి పటేల్, హన్మండ్లు యాదవ్ తదితరులున్నారు.

సింధే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమక్షంలో తిమ్మనగర్, గౌడ్మెగాం, పిట్లం, ధర్మారం తదితర గ్రామాలకు చెందిన 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విజయ్, పత్తి సంతోష్, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు నాయక్‌పోడ్‌ల మద్దతు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచ గ్రామానికి చెందిన ఆదివాసినాయక్ పోడ్ కులస్తులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మండలాల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, ఉపసర్పంచ్ కుర్మ సంతోష్ తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సులు నిలపడం లేదని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న చిన్నమల్లారెడ్డి విద్యార్థులు

కామారెడ్డి అర్బన్: ఉదయం కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే సమయంలో ఆర్టీసీ బస్సులు నిలపడం లేదని కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామ విద్యార్థులు బుధవారం రాస్తారోకో చేశారు. అదే సమయంలో గ్రామం వైపు వస్తున్న ఎన్నికల పరిశీలకుడి వాహనం రాస్తారోకోలో చిక్కుకుపోయింది. దీంతో ఎన్నికల పరిశీలకుడు విద్యార్థుల వద్దకు వచ్చి సమస్య తెలుసుకుని ఉన్నతాధికారులకు మాట్లాడతానని రాస్తారోకో విరమించాలని సముదాయించడంతో విద్యార్థులు శాంతించారు. ఉదయం, సాయంత్రం అదనపు బస్సులు నడపాలని వారు డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో రిటైర్డ్ డీటీ మృతి



ఎల్లారెడ్డి: మండల కేంద్రంలో రిటైర్డ్ డీటీ హస్నన్ సిద్దిఖీ (80) బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎల్లారెడ్డి, లింగంపేట మండలాల్లో డీటీగా విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయినట్లు పేర్కొన్నారు. కొంత కాలంగా అనారోగ్యానికి గురికావడంతో బుధవారం మృతి చెందారు. సిద్దిఖీ మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

కేసీఆర్ పాలనలో అభివృద్ధి శూన్యం

- కామారెడ్డి అభివృద్ధిపై చర్చకు సవాల్
- రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి



హరిజనవాడలో మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలనలో అభివృద్ధి శూన్యమని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన ఇందిరాగాంధీ స్టేడియంలో వాకర్లతో మాట్లాడారు. అక్కడి నుంచి చాయ్‌తో చర్చ కార్యక్రమంలో భాగంగా హరిజనవాడ, ముదాం గల్లి, అంబేద్కర్ కాలనీలో ప్రజలతో ముచ్చటించారు. బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాలేవన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద కాంగ్రెస్ నేతలు ఓట్లు అడగరని, ఇందిరమ్మ ఇళ్ల దగ్గర బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడగవద్దని సవాల్ విసిరారు. కల్వకుంట్ల కుటుంబంలో అందరికి ఉద్యోగాలు భర్తీ చేశారని, రాష్ట్రంలో నిరుద్యోగులకు మాత్రం మొండి చేయి చూపించారని స్థానిక యువతీయువకులతో చర్చించారు. కామారెడ్డి అభివృద్ధి చేసి ఉంటే చర్చకు రావాలని బీఆర్ఎస్‌కు సవాల్ చేశారు. క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో మోచి కులస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌గౌడ్, గోనె శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

రేవంత్‌రెడ్డి గెలుపు ఖాయం

దోమకొండ: కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తాడని ఉమ్మడి దోమకొండ మండల ఇన్‌చార్జి పాల్వాయి రజనీకుమారి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గతంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందాయన్నారు.అదే పాలనను రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అందిస్తుందన్నారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కుమార్, తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో ఇద్దరు కౌన్సిలర్ల చేరిక



కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. 19వ వార్డు కౌన్సిలర్ చింతల రవీందర్‌గౌడ్, 28వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల రమేష్‌లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనీల్‌లు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్, కో–ఆప్షన్ సభ్యుడు

బీబీపేట: జనగామ గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త, కాంగ్రెస్ నాయకుడు తిమ్మయ్యగారి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉప్పర్‌పల్లి గ్రామ సర్పంచ్ కాసర్ల ప్రసాద్, మండల కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆసీఫ్ కాంగ్రెస్‌లో చేరారు.

మార్పు కోసం కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

- కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి నేరెళ్ల శారద



కాంగ్రెస్‌లో చేరుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు

భిక్కనూరు: గత పదేళ్లలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అవినీతి రాజ్యమేలుతుందని, మార్పు కోసం కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని ఆ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జి నేరెళ్ల శారద అన్నారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రంలో టీడీపీ మండలాధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తులసీలు వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణమద్దతు ఇవ్వాలని కోరారు.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్, సిబ్బందికి సూచించారు. బుధవారం ఎల్లారెడ్డి మోడల్ డిగ్రీ కళాశాలలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 30న ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా ఎన్నికల విధులు కేటాయించిన వారు తప్పకుండా విధులకు హాజరు కావాలని అన్నారు. ఏఆర్‌వో సురేష్, సిబ్బంది లోకేష్, సిద్దు, సరళ, డీటీ రాజేశ్వర్ తదితరులున్నారు.



పోలీసుల కవాతు



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. గండివేట్, సీతాయిపల్లి, గాంధారి గ్రామాల్లో కవాతు చేశారు. ఈ కవాతులో సదాశివనగర్ సీఐ రామన్, ఎస్సై ప్రేమ్‌దీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ మందిర వార్షికోత్సవం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లిలో బుధవారం హనుమాన్ మందిర ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పూజారి శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయం వద్ద గణపతి హోమం, 1008 తమలపాకుల పూజ, ధ్వజారోహణం, చందన లేపన తదితర కార్యక్రమాలు జరిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నసంతర్పణ చేశారు. సర్పంచ్ దేశబోయిన సాయిలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



అందుబాటులో ఉండి సేవ చేస్తా



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి



గొర్రెపిల్లను బహూకరిస్తున్న గొల్లకురుమలు

- హెలికాప్టర్ నేతలకు ఓటేస్తే ఆగం జేస్తరు
- కామారెడ్డి బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి: 'ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగినోడ్ని.. ప్రజల కష్టసుఖాల్లో ఉన్న.. తనను గెలిపిస్తే అందుబాటులో ఉండి మరింత సేవ చేస్తా.. హెలికాప్టర్లలో వచ్చిపోయే నేతలకు ఓటేస్తే ఆగం జేస్తరు ' అని కామారెడ్డి అసెంబ్లీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మాచారెడ్డి మండలం అంతంపల్లి, లక్ష్మీరావులపల్లి గ్రామాల్లో, భిక్కనూరు మండల కేంద్రంతో పాటు సిద్దరామేశ్వరనగర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కామారెడ్డి ప్రజల భూములు ఆగం కావద్దంటే బీజేపీకి ఓటేయాలని కోరారు. గజ్వేల్‌లో భూములు దోచుకున్నోళ్లు, ఓటుకు నోటు కేసులో ఉన్నోళ్లకు ఓట్లేస్తే బతుకులు ఆగం జేస్తరని ఆరోపించారు. ఎన్నికల సమయంలోనే హెలికాప్టర్లలో వచ్చిపోతున్న వాళ్లు గెలిస్తే ఓట్లేసినోళ్ల బతుకులు ఆగమవుతాయన్నారు.

మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేస్తా

తాను ఎన్నికల్లో గెలువడం తథ్యమని ఒక వేళ ఓటమి చెందినా తాను ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోను కచ్చితంగా అమలు చేస్తానన్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద నియోజకవర్గంలో 35 వేల ఇళ్లను నిర్మింపజేస్తానన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలని, కమలానికి ఓటు వేసి బీజేపీని గెలిపించాలన్నారు. మాచారెడ్డి బీజేపీ నేతలు బాల్ రాజు, చారి, భిక్కనూరు బీజేపీ నేతలు రమేష్‌రెడ్డి, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు సీఎం అభ్యర్థులు ఓడిపోవడం ఖాయం

కామారెడ్డి టౌన్: ఇద్దరు సీఎం అభ్యర్థులు కామారెడ్డిలో చిత్తుగా ఓడిపోవడం ఖాయమని, అవినీతి పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఆయన జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా, హనుమాన్ దేవాలయం, పెద్దబజార్, గొల్లవాడలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రజా క్షేత్రంలో తేల్చుకోలేక బీజేపీపై బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. బీజేపీకి ఓటు వేస్తే అవినీతి పాలన పోతుందన్నారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి



ప్రచారం చేస్తున్న సుభాష్‌రెడ్డి సతీమణి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎక్కపల్లితండాలో బుధవారం ఎల్లారెడ్డి బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సతీమణి విద్యారాణి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తండావాసులతో ఆమె మాట్లాడారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి జరుగుతుందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే తెలంగాణకు మేలు జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. గడప గడపకు కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తామన్నారు. ఆమె వెంట కోడలు నవ్య, కూతురు దివ్య, మండల పార్టీ అధ్యక్షుడు దత్తురాం, నాయకులు చందు, సాయిలు, తదితరులున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా



మేడిపల్లిలో మాట్లాడుతున్న మదన్‌మోహన్



పార్టీలో చేరుతున్న ముకుంద్‌రావు

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్



చిట్యాలలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాంధారి(ఎల్లారెడ్డి): చేతి గుర్తుకు ఓటు వేసి తనకు ఒక్క అవకాశం ఇవ్వండని, నియోజకవర్గాన్ని, మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. ముదెల్లి, సర్వాపూర్, నర్సాపూర్, వెంకటాపూర్, మొండి సడక్, మేడిపల్లి, సీతాయిపల్లి, పోతంగల్ కలాన్ తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన సురేందర్ బీఆర్ఎస్‌లో చేరారని విమర్శించారు. ఆయన గెలిచినప్పటి నుంచి గ్రామాల్లో అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. తనను గెలిపిస్తే మారు గ్రామాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు ఇళ్లు మంజూరు చేయిస్తానని, గ్రామాల్లో పూరి గుడిసెలు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఇందిరా రాణి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మదన్ మోహన్ సమక్షంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాతు సంగెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గాంధారి సింగిల్ విండో మాజీ చైర్మన్, వజీర్ ముకుంద్‌రావు, చద్మల్ సర్పంచ్ మదారి బాయి ప్రేమ్‌సింగ్ పార్టీలో చేరారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలలో బుధవారం కాంగ్రెస్ నేతలు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌మోహన్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

బీజేపీ నేత భాస్కర్ రాజీనామా



బాన్సువాడ: బాన్సువాడ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. టీఆర్ఎస్ తరపున గతంలో జెడ్పీటీసీగా విజయం సాధించారు. 2021లో అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ప్రస్తుతం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటయ్యాయని, దీంతో పార్టీలో ఉండలేక రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నేడో రేపో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని ఆయన అన్నారు.

ఎల్లారెడ్డిలో సీఎస్ఐ చర్చి 11వ వార్షికోత్సవం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి సీఎస్ఐ చర్చి 11వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్చిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి మెదక్ డయాసిస్ చైర్మన్ రెవరెండ్ జార్జి ఎబినైజర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసు ప్రభువు దృష్టిలో అందరూ సమానులేనని అన్నారు. శామ్యూల్, రాజశేఖర్, మోహన్ తదితరులున్నారు.